క్లుప్తంగా

ముగిసిన నవమి ఉత్సవాలు

మందస: మూలిపాడు పంచాయతీ శ్రీనివాసపురంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. రఘునాథస్వామి ఆలయంలో మార్చి 29న నవమి ఉత్సవాలు, శ్రీరామతారక శాంతి యజ్ఞం ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామస్తులను అలరించాయి. ఒడిశా నుంచి వచ్చిన భగవాన్‌త్రిపాఠి ఆధ్వర్యంలో తొమ్మిది మంది వేదపండితులతో కార్యక్రమాలను నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం భారీగా భక్తులు గంగా నిమజ్జనం చేశారు. లోక కల్యాణానికి ఆధ్యాత్మిక యజ్ఞం, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మూలిపాడు సర్పంచ్, ఉప సర్పంచ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుసిరి వెంకటరావు, రామచంద్రచౌదరి, మాజీ సర్పంచ్ గౌరహరోమహంతి పాల్గొన్నారు.

రోడ్డు సమస్య పరిష్కారానికి కృషి

సోంపేట: గొల్లూరు పంచాయతీ దామోదపురం గ్రామ రహదారి సమస్య పరిష్కరించడానికి కృషిచేస్తానని జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద అన్నారు. దామోదరపురం గ్రామాన్ని ఆదివారం సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పక్కారోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని.. సమస్య పరిష్కరించాలని స్థానికులు ఆమెను కోరారు. మండల కమిటీ అధ్యక్షుడు తడక జోగారావు, మాజీ సర్పంచ్ గోపాల కృష్ణ, దున్న మోహనరావు ఉన్నారు.

సామాజిక మండపం నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు

కవిటి: బల్లిపుట్టుగ లక్ష్మీనరసింహాలయం వీధిలో సామాజిక మండపం నిర్మాణానికి జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆదివారం శంకుస్థాపన చేశారు. జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.5 లక్షలు వెచ్చించినట్టు జెడ్పీ చైర్‌పర్సన్ తెలిపారు. వైస్‌ఎంపీపీ పూడి నేతాజీ; ఏఎంసీ వైస్ చైర్మన్ యలమంచి నీలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రజనీకుమార్‌దొళాయి, బద్రి ప్రకాష్, సర్పంచ్ శ్రీకన్యాదొళాయి, మార్పు వెంకటేష్, తలగాన భూషయ్య, ఎంపీటీసీ సభ్యుడు మనోహర్‌దొళాయి పాల్గొన్నారు.

ప్రత్యేక ఉపాధి కల్పించాలి



మాట్లాడుతున్న కాశీవిశ్వనాథచౌదరి

టెక్కలి: సొండి కులస్తులకు ప్రత్యేక ఉపాధి కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కాశీవిశ్వనాథ చౌదరి కోరారు. టెక్కలిలో సొండికుల సంక్షేమ సంఘం సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు సారా అమ్మకాలను సొండి సామాజిక వర్గానికి చెందిన కొందరు నిర్వహించేవారని.. అయితే ప్రస్తుతం సారాను నిషేధించడంతో జీవనోపాధి కష్టతరంగా మారిందన్నారు. ఈ క్రమంలో ప్రత్యేక ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తమను ఓబీసీలో చేర్చే విధంగా చూడాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి బి.రాజారావు, ప్రతినిధులు యు.గణపతిరావు, జి.నాగభూషణ్, ఆర్.శ్రీను, గిరిబాబు, ఆర్.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ 'నర్తు'కు సన్మానం



రామారావును సత్కరిస్తున్న దృశ్యం

కవిటి: ఎమ్మెల్సీ నర్తు రామారావును కొత్తపుట్టుగలోని ఆయన నివాసంలో కంచిలి మండల యాదవ సామాజికవర్గానికి చెందిన నాయకులు ఆదివారం సత్కరించారు. కంచిలి పీఏసీఎస్ చైర్మన్ గుమ్మడి రాందాస్, బొగాబని సర్పంచ్ సింహాచలం ఉన్నారు.

వ్యక్తికి గాయాలు

పలాస: భూ వివాదంలో ఒకరు గాయపడినట్టు పోలీసులు తెలిపారు. గురుదాసుపురం గ్రామానికి చెందిన టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణకుమార్ కొన్నేళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. రామక్రిష్టాపురం గ్రామం వద్ద ఇచ్ఛాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి భూమిని దురాక్రమణ చేశాడని అభియోగాలు ఉన్నాయి. కొంతకాలంగా ఈ సమస్య ఇరువర్గాల మధ్య నలుగుతుంది. ఈ నేపథ్యంలోనే లక్ష్మణకుమార్‌పై ఆదివారం కొంతమంది దాడి చేయడంతో గాయపడినట్టు పోలీసులు తెలిపారు. కాశీబుగ్గ సీఐ శ్రీనివాసరావు ఘర్షణపై ఇరువర్గాల నుంచి సమాచారం సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సౌకర్యానికి ప్రాధాన్యత

కంచిలి: మంచినీటి సౌకర్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి అన్నారు. బెల్లుపడ గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.4 లక్షలతో చేపట్టనున్న మంచినీటి పథకం పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు.

కేటీ రోడ్డును కానుకగా ఇస్తా..

- మూడో విడత ఆసరా సంబరాల్లో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



మహిళలకు చెక్కు అందజేస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో కేటీ రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేసి మున్సిపాలిటీ ప్రజలకు కానుకగా ఇస్తానని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చెప్పారు. కాశీబుగ్గ సంత మైదానంలో వైఎస్సార్ విగ్రహం ఎదురుగా ఆదివారం వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలను నిర్వహించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక కౌన్సిలర్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బెల్లాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టినప్పటి నుంచి పలాసలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కేటీరోడ్డు విస్తరణ 80 అడుగల్లో పూర్తయితే పాదచారులు, వాహనదారులు, వ్యాపారులు సంతోషంగా ఉంటారన్నారు. ఇప్పటికే కార్పొరేట్ మాల్స్‌తో జంట పట్టణాలు సందడిగా మారాయన్నారు. వచ్చే ఎన్నికల నాటికి రైల్వే వంతెన కూడా పూర్తి చేస్తామని చెప్పారు. రూ.100 కోట్లతో మంచినీటి పథకం నిర్మించి ఇంటింటికీ కుళాయిల ద్వారా నీటిని అందిస్తామని చెప్పారు. రెండు నెలల కాలపరిమితిలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా చేరువ చేస్తున్నారన్నారు. అయితే టీడీపీ అధికారంలోకి వస్తే పథకాలన్ని నిలిచిపోతాయన్నారు. చంద్రబాబు మాటలను ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. టీడీపీ హయాంలో కనీసం డిగ్రీ కళాశాలను కూడా మున్సిపాలిటీలో ఏర్పాటు చేయలేకపోయారన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని 31 వార్డులకు చెందిన 8,301 మంది మహిళలకు 7 కోట్ల 31 లక్షల 70 వేల రూపాయల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, ప్రభుత్వ విప్ శంకర్‌పండా, సీనియర్ నాయకుడు హనుమంతు వెంకటరావుదొర, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, సచివాలయ కన్వీనర్ బడగల బళ్లయ్యనాయుడు, కౌన్సిలర్లు గుజ్జు జోగారావు, జోగి సతీష్, సనపల సింహాచలం, సవర సోమేశ్వరరావు, కోఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్‌కుమార్, గౌరీ త్యాడి, రోణంకి శ్రీనివాసరావు, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, టీఎంసీ బోర భాస్కరరావు పాల్గొన్నారు.



హాజరైన మహిళలు

పలాస పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా సింహాచలం



సింహాచలం, జోగారావు, బళ్లయ్య, గోపీలను అభినందిస్తున్న మంత్రి అప్పలరాజు తదితరులు



మంత్రి అప్పలరాజును కలిసిన జగన్, పార్టీ నాయకులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడుగా సనపల సింహాచలం నియమితులయ్యారు. అలాగే సచివాలయాల కన్వీనర్‌గా బడగల బల్లయ్య, మున్సిపాలిటీ స్పోక్స్ పర్సన్లుగా గుజ్జు జోగారావు, శిష్టు గోపీలను నియమిస్తూ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదివారం ప్రకటించారు. ఆసరా సంబరాల వేదికపై ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా వారిని నాయకులు సత్కరించారు.

మందస అధ్యక్షుడిగా జగన్

మందస: మందస మేజర్ పంచాయతీ అధ్యక్షుడుగా సిందిరి జగన్నాథరావు(జగన్) నిమితులయ్యారు. గతంలో పని చేసిన బరాటం జయప్రకాశ్ స్థానంలో ఈయన్ని నియమించారు. పలువురు నాయకులు జగన్‌ను అభినందించారు. అనంతరం మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును పలాసలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

పోటీ పరీక్షలతో ప్రతిభకు గుర్తింపు



ఇచ్ఛాపురం: మేధా సమ్మాన్ ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న ఒడియామైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యన్నారాయణపాఢీ తదితరులు



కవిటి: బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ ధనంజయమజ్జి

ఇచ్ఛాపురం: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించేందుకు పోటీ పరీక్షలు దోహదపడతాయని ఒడియా డీఐ దుర్గాప్రసాద్ చౌదరి, ఏపీ ఒడియా మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యన్నారాయణ పాఢీ అన్నారు. మున్సిపాలిటీలోని బ్రాహ్మణవీధి ఒడియా ప్రాథమిక పాఠశాల ఆవరణలో అపోటా (ఏపీ ఒడియా టీచర్స్ అసోసియేషన్) మండలాధ్యక్షుడు పి.కవిరాజ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండలస్థాయిలో మేధాసమ్మాన్ ప్రతిభా పరీక్షలు నిర్వహించగా.. 14 పాఠశాలల నుంచి ఒడియా మాధ్యమంలో ఐదో తరగతి చదువుతున్న 70 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ కనబర్చిన శివాని బెహర, జ్ఞానరంజన్ బెహర (ఈదుపురం), పవిత్రసాహు (పంజావీధి) మొదటి మూడు స్థానాలను దక్కించుకున్నారు. అపోటా రాష్ట్ర కార్యదర్శి బృందావన్ దోళాయి పాల్గొన్నారు.

'అపోటా' కృషి అభినందనీయం

కవిటి: ఒడియా మీడియం విద్య బలోపేతానికి ఏపీ ఒడియా టీచర్స్ అసోసియేషన్(అపోటా) చేస్తున్న కృషి అభినందనీయమని కవిటి ఎంఈవో ధనంజయమజ్జి అన్నారు. సహలాలపుట్టుగ జడ్పీ ఒడియా ఉన్నత పాఠశాలలో మేధా సమ్మాన్ ప్రతిభా పరీక్షను నిర్వహించారు. 21 పాఠశాలల నుంచి 69 మంది బాలబాలికలు పరీక్ష రాశారు. సహలాలపుట్టుగ(జస్విత్‌ప్రధాన్) ప్రథమస్థానం, మొల్లిపుట్టుగ (జి.చైతన్య)ద్వితీయ, గోవిందపుట్టుగ (కన్నుపూజా) తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు. వీరికి ఎంఈవో ధనంజయ మజ్జి, మండల శాఖ అధ్యక్షుడు జేసి కృష్ణమూర్తి, కవిటి జడ్పీ ఒడియా ఉన్నతపాఠశాల హెచ్‌ఎం లింగరాజ్ ప్రసాద్ పట్నాయక్ బహుమతులు అందజేశారు.

కంచిలి: పోటీ పరీక్షల్లో పాల్గొనడంతోనే విద్యార్థులు సత్ఫలితాలు సాధిస్తారని ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్ అన్నారు. కంచిలి ప్రాథమిక పాఠశాల ఆవరణలో అపోటా ఆధ్వర్యంలో ఐదో తరగతి చదవుతున్న ఒడియా మీడియం విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ పరీక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. పరీక్ష పేపర్లను ఎంఈఓ చేతులమీదుగా తెరిచారు. 89 మంది పరీక్ష రాశారు. బేసి సంతోషిని (ఎంపీపీ స్కూల్, దాలేశ్వరం), సింధు బిసాయి (ఎంపీపీ స్కూల్, జె.మాణిక్యపురం) దినేష్ బెహరా (ఎంపీపీ స్కూల్, కుమ్మరిపేట) మొదటి మూడుస్థానాల్లో నిలిచారు. వీరిని ఎంఈవో తదితరులు అభినందించి, సర్టిఫికెట్‌తోపాటు బహుమతులు అందజేశారు. మండల ఒడియా టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్ ఖడంగా, సెక్రటరీ చైతన్య బిసాయి, లక్ష్మీనారాయణ, భాస్కరపాఢి పాల్గొన్నారు.

సోంపేట: బేసిరామచంద్రాపురం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రతిభా పరీక్షకు 70 విద్యార్థులు హాజరయ్యారు. ఎంఈవో ఎస్.జొరాడు మాట్లాడుతూ.. ప్రతిభా పరీక్షల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో అవగాహన పెరుగుతోందన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అపోటా రాష్ట్ర కార్యదర్శి బృందావన్ దొలాయి, డీఐ దుర్గాప్రసాద్ చౌదరి, ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి రామహరి పాఢి, బుడ్డాన శ్రీకృష్ణ పాల్గొన్నారు.

కాశీబుగ్గ: తర్లాకోట ప్రభుత్వ పాఠశాలలో ఒడియా విద్యార్థులకు ప్రతిభ పరీక్ష జరిగింది. నల్లా నాగేశ్వరరావు, దుర్గా ప్రసాద్‌మహంతి, ఎంఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

మంత్రిని కలిసిన అనుబంధ విభాగాల చైర్మన్లు

ఇచ్ఛాపురం: వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు తాడి ఆదిరెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్‌లు మంత్రి సీదిరి అప్పలరాజును పలాసలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని మంత్రి వారికి సూచించారు. పదవులు రావడానికి సహకరించినందుకు మంత్రి అప్పలరాజుకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు.



మంత్రి సీదిరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆదిరెడ్డి, అన్వేష్

సాయిరాజ్ పరామర్శ

సోంపేట: బారువ మేజర్ పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త అమర లోకనాథం అనారోగ్యం పాలై శస్త్రచికిత్స అనంతరం కోలుకుని ఇంటికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, పార్టీ నాయకులు లోకనాథాన్ని ఆదివారం పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సాయిరాజ్ వెంట ఉప సర్పంచ్ పెద్దింటి రాజేశ్వరరావు, కర్రి సత్యం ఉన్నారు. అలాగే లోకనాథాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, మండల కమిటీ అధ్యక్షుడు తడక జోగారావు కూడా పరామర్శించారు.



లోకనాథంతో మాట్లాడుతున్న సాయిరాజ్

నేటి నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు'

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో 'జగనన్నే మా భవిష్యత్తు'కార్యక్రమాన్ని సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన గృహసారథులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తొలిరోజున కొళిగాం, కీర్తిపురం, తేలుకుంచి, బిర్లంగి గ్రామ సచివాలయ పరిధిలో, మంగళవారం మండపల్లి, బాలకృష్ణాపురం, కేధారిపురం, అరకబద్ర, బుధవారం లొద్దపుట్టి, తులసిగాం, ధర్మపురం, కొఠారీ, గురువారం ఈదుపురం-1, ఈదుపురం-2, కేశుపురం, బూర్జపాడు గ్రామ సచివాలయ పరిధుల్లో గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లతో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



గణితంపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పలాస: గణిత ప్రాథమిక భావనలపై నీలావతి గ్రామంలోని గ్రంథాలయంలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉపాధ్యాయులు సి.హెచ్.హేమాంబరరావు, దున్న నాగేశ్వరరావు తరగతులు బోధించారు. కార్యక్రమంలో యూవీవీ గౌరవ అధ్యక్షుడు బత్తిన ఓంకార్, ప్రధాన కార్యదర్శి బొడ్డు చిన్నారావు, లైబ్రేరియన్ గీతాంజలి పాల్గొన్నారు.

ఆసరా పత్రాల పంపిణీ



ఆసరా పత్రాలతో అరకబద్ర మహిళలు

ఇచ్ఛాపురం రూరల్: నవరత్నాలు అమలులో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పేదరికాన్ని నిర్మూలించడానికి, ఉత్పాదకతను మెరుగుపరచడానికి వైఎస్సార్ ఆసరా పథకం అమల్లో ఉందని ఏపీఎం సనపల ప్రసాదరావు అన్నారు. వీవోఏల ద్వారా మండలంలోని 21 పంచాయతీల్లోని లబ్ధిదారులకు ఆసరా పత్రాలు పంపిణీ చేశారు. మూడో విడత సాయాన్ని పొదుపు సంఘాల మహిళల ఖాతాల్లో జమ చేయనున్నామన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల నాటికి పొదుపు సంఘాల పేరిట మహిళలకు బ్యాంకుల్లో ఉన్న అప్పు మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించనుందన్నారు.

సీలింగ్ ఫ్యాన్ వితరణ

టెక్కలి: స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి టెక్కలి ఎంపీపీ అట్ల సరోజనమ్మ సీలింగ్ ఫ్యాన్‌ను వితరణ చేశారు. కేంద్రంలోని చిన్నారులు ఎండ వేడిమికి ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకుని ఉదారతగా సీలింగ్ ఫ్యాన్‌ను సమకూర్చారు. అంగన్‌వాడీ సిబ్బంది, పిల్ల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

చట్టాలపై అవగాహన

ఇచ్ఛాపురం రూరల్: మహిళల భద్రత కోసం తీసుకువచ్చిన దిశ చట్టం మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందని కేశపురం సచివాలయం మహిళా పోలీస్ షేక్ మధర్బీ అన్నారు. డొంకూరు, పెద్ద లక్ష్మీపురం, చిన్న లక్ష్మీపురం మత్స్యకార గ్రామాల్లో ఆదివారం పర్యటించి స్థానిక ప్రజలకు చట్టాలు, వాటి ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. సార అక్రమ రవాణాపై మహిళలు దృష్టి సారించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతలను నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడ్డ ముఖలింగం, మాజీ సర్పంచ్ పులకల డొంబురు, డిజిటల్ అసిస్టెంట్ హేమంత్, యువజన సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



పెద్దలక్ష్మీపురంలో మాట్లాడుతున్న షేక్ మధర్బీ

జంగిల్ క్లియరెన్స్ చేయకుండానే బిల్లుల చెల్లింపు

- మండల సమావేశంలో ఆర్‌అండ్‌బీ అధికారులపై ఎంపీపీ ఆగ్రహం

సంతబొమ్మాళి: ఉమిలాడ నుంచి వనవిష్ణుపురం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయకుండానే రూ. 1.40 లక్షల బిల్లులు ఎలా చెల్లించారని సంబంధిత అధికారులపై మండల పరిషత్ అధ్యక్షురాలు మేరుగు రాజేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. పని జరగకుండా కోటబొమ్మాళి ఆర్‌అండ్‌బీ జేఈ సరోజ బిల్లులు ఎలా చెల్లించారని టెక్కలి ఏఈ సతీష్‌ను నిలదీశారు. సమాచారం తెలియజేస్తానని ఏఈ సతీష్ బదులిచ్చారు. సంతబొమ్మాళి పీహెచ్‌సీ డాక్టర్ గురుమూర్తి కనీసం స్పందించటంలేదని, సమావేశాలకు హాజరుకావడం లేదని, పీహెచ్‌సీల్లో సమయపాలన పాటించటం లేదని ఎంపీటీసీ సభ్యురాలు దూబ లక్ష్మి, సర్పంచ్ కె.లక్ష్మి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ కార్యక్రమాలు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయాలనే బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలకు లేదా అని ఐసీడీఎస్ పీవో శోభారాణిని పలువురు సభ్యులు ప్రశ్నించారు. ఇళ్ల బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందని.. వెంటనే చెల్లించాలని హౌసింగ్ అధికారులను జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి సూచించారు. బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉంటుందని ఎంఈవో చిన్నవాడు దృష్టికి పలువురు సభ్యులు తీసుకొచ్చారు. ఎం.సున్నాపల్లి పాఠశాలకు చెందిన భవనాలు శిథిలావ్యవస్థకు చేరుకోవడంతో వేరే చోట తరగతులు నిర్వహిస్తున్నారని, వెంటనే అదనపు భవనాలు మంజూరు చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు వసంతరెడ్డి, వైస్ ఎంపీపీ నక్క చింతామణి కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎంఈవో చిన్నవాడు వివరణ ఇచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పి.తులసమ్మ, ఎంపీడీవో ఉమాసుందరి, తహసీల్దార్ చలమయ్యలు ఉన్నారు.



పాఠశాల భవనాలు మంజూరుపై ఎంఈవోను ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వసంతరెడ్డి

లోకశాంతి కోసం 'మట్టల ఆదివారం'



కాశీబుగ్గ: క్రైస్తవుల సందడి



టెక్కలి: ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: లోకశాంతి కోసం క్రైస్తవులు మట్టల ఆదివారం (పామ్‌సండే) నిర్వహిస్తుంటారని క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ అన్నారు. పట్టణంలోని గొల్లవీధి ఆంధ్రబాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఏసుప్రభువు జెరూసెలెంలో జయప్రవేశం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని పామ్‌సండేని నిర్వహిస్తుంటారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా పువ్వులతో అలంకరించిన ఈతమట్టలను చేతపట్టుకుని పట్టణంలోని ప్రధానవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి అధ్యక్షుడు ప్రత్తి విజయ్‌కుమార్, తాతాజీ, వజ్రపు వెంకటేష్, జోష్‌కుమార్, వీరకుమార్, లక్ష్మీనారాయణ, కిరణ్, దిలీప్ పాల్గొన్నారు.

టెక్కలి: స్థానిక ఆంధ్రా బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం నగర సంకీర్తన ప్రార్థనలు చేశారు. పాస్టర్ కె.జాషువా నేతృత్వంలో నగర సంకీర్తనలో పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం కండ్రావార్డు క్రైస్తవ మందిరంలో ఆస్టర్ పర్వదినం పురస్కరించుకుని మట్టల ఆదివారం పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ బిమ్మో బెహరా ఆధ్వర్యంలో ఈతకమ్మలకు పుష్పాలంకారణ చేసి వీధుల్లో ఊరేగించారు.

కాశీబుగ్గ: మున్సిపాలిటీలో పామ్ సండే వేడుకలు జరిగాయి. పల్లివీధిలోని జె.ఎస్.ఎం.బి. చర్చిలో మహిళలు, పిల్లలతో మట్టలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రైస్తవ నాయకుడు జి.ఎం.ఎస్.అనిల్‌రాజ్, ఐజాక్, జాన్‌బాబు, ప్రభుదాస్ పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టండి

నందిగాం: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై టీడీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని వైఎస్సార్‌సీపీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి పూర్తిస్థాయిలో తీసుకెళ్లాలన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, కురమాన బాలక్రిష్ణారావు, సర్లాన బైరాగి, చిన్ని జోగారావు, అంబోడి విష్ణు, పుష్పా సత్యం, తమిరె దేవేంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పేరాడ తిలక్

జగనన్నే మా భవిష్యత్తుపై అవగాహన

ఇచ్ఛాపురం: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్, గృహసారథులపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. మున్సిపాలిటీలోని 1, 2, 3, 8 వార్డు సచివాలయాలకు చెందిన కన్వీనర్లు, గృహసారథులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు పూర్తిగా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సాలిన ఢిల్లీ, వార్డు కౌన్సిలర్లు సుగ్గు ప్రేమ్‌కుమార్, పి.మధుమూర్తి, చాట్ల తిరుపతి, ప్రకాష్‌పట్నాయక్, ఎస్.బాలాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజలక్ష్మి

సాహితీ బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం కల్చరల్: సాహిత్యాభివృద్ధిలో శ్రీశ్రీ కళావేదిక సేవలు అభినందనీయమని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. తిరుపతిలో జరగనున్న సాహితీ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం రణస్థలంలో మంత్రి ధర్మాన, ఎమ్మెల్యే కిరణ్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆవిష్కరించారు. మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తూ సాహిత్యంపై మక్కువతో రచనలు చేస్తున్న శ్రీశ్రీ కళావేదిక మీడియా ప్రతినిధి బమ్మిడి అమ్మోజీని అభినందించారు. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించడం శుభపరిణామమన్నారు. అనంతరం అమ్మోజీ మాట్లాడుతూ శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9, 10, 11వ తేదీల్లో సాహితీ బ్రహ్మోత్సవాలు జరుగుతాయని చెప్పారు. ఇప్పటికే 2వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. కళాకారులందరికీ ఉచితంగా వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పి.రజనీసాయికుమార్, జెడ్పీటీసీ టి.సీతారాం, ఎంపీడీఓ ధనుంజయరావు, ఎస్సై రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సాహితీ బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన, తదితరులు

మత్స్యకార నాయకుడు జగదీష్ మృతి తీరనిలోటు

కవిటి: పెద్దకర్రివానిపాలెం గ్రామానికి చెందిన మత్స్యకార నాయకుడు కర్రి జగదీష్ మృతి వైఎస్సార్‌సీపీకి తీరనిలోటని ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. అనారోగ్యంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ జగదీష్ ఆదివారం వేకువజామున మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే పెద్దకర్రివానిపాలెంలోని అతని ఇంటికి సాయిరాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు చేరుకున్నారు. మృతదేహం ఇంటికి తీసుకొచ్చేలోగా అంత్యక్రియల ఏర్పాట్లను సాయిరాజ్ దగ్గరుండి పర్యవేక్షించారు. అలాగే జగదీష్ పాడెని కూడా మోసి అంత్యక్రియలు పూర్తయ్యేవరకూ అక్కడే ఉన్నారు. కాగా జగదీష్ అనారోగ్యానికి గురైన వెంటనే రిమ్స్‌కు తరలించి అత్యవసరవైద్యం చేయించే బాధ్యతను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ దగ్గరుండి పర్యవేక్షించారు.